క్లుప్తంగా

మార్కండేశ్వరస్వామికి అన్నాభిషేకం



ప్రత్యేక అలంకరణలో మార్కండేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గురువారం ఆలయ అర్చకులు అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా, పార్టీ నాయకులు

తర్లుపాడు: మండలంలోని కారుమానుపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుడు దొండపాటి వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు గురువారం నివాళులు అర్పించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన మృత దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు మురారి, నియోజకవర్గ ఉద్యోగ, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు టి.రంగారెడ్డి, సర్పంచ్‌లు రామిరెడ్డి, కాశయ్య, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, స్థానిక నాయకులు వెలుగొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాల సరఫరా



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2 వెంకటరత్నం

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాల సరఫరా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని 3950 మంది విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను సరఫరా చేస్తున్నట్లుగా ఎంఈఓ-2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. మండలానికి 18671 పాఠ్యపుస్తకాలు, 21136 నోటు పుస్తకాలు వచ్చాయని వివరించారు. జూన్ 12వ తేదీన విద్యార్థులందరికీ పుస్తకాలు పంపిణీ చేయాలని హెచ్ఎంలకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివనాగేశ్వరరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వర్లు, సీఆర్పీలు పుల్లయ్య, రామాంజి, ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కొమరోలు హైస్కూల్ హెచ్ఎం



కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కల్లూరి శివనాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న కాశయ్య ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివనాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు.

పవర్ డిమ్!

- గిద్దలూరు పట్టణ ప్రజలను వేధిస్తున్న లోవోల్టేజ్ సమస్య
- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాలల్లో విద్యుత్ స్తంభాలు ప్రజలకు ప్రాణాపాయం కలిగించే విధంగా ప్రమాదరకంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల లోవోల్టేజి సమస్య కారణంగా గృహోపకరణాలు కాలిపోతూ ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పెద్దపోస్టాఫీసు రోడ్డు, వినాయకనగర్, డిఆర్ఆర్ అపార్ట్‌మెంట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డీఆర్ఆర్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లే రోడ్డులో విద్యుత్ ఇనుప స్తంభాలు నిత్యం మురుగు ప్రవహించే డ్రెయినేజీలో ఉంది. దీంతో ఆ ఇనుప స్తంభం తుప్పుపట్టి విరిగిపోయేదుకు సిద్ధంగా ఉంది. వినాయకనగర్‌లో ఇనుప స్తంభం రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వాహనాలు ఢీకొట్టి స్తంభం సగం మేర ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. పెద్దపోస్టాఫీసు వద్ద విద్యుత్ స్తంభానికి ఆనుకుని గృహ నిర్మాణం చేపట్టారు. ఆ ప్రాంతంలోని గృహాలకు విద్యుత్ సరఫరా చేసే తీగలను ఎక్కువ సంఖ్యలో అదే స్తంభానికి కనెక్షన్ ఇవ్వడంతో ప్రమాదకరంగా, గజిబిజిగా ఉంది. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ఉండాల్సినదాని కంటే అధికంగా విద్యుత్ కనెక్షన్లు ఒకటే స్తంభానికి ఉండటం వల్ల లోవోల్టేజి సమస్య తలెత్తుతోంది.

గిద్దలూరు విద్యుత్‌శాఖ టౌన్ పరిధిలో మిట్టమీదిపల్లె, పాములుపల్లె, చట్టిరెడ్డి, కొత్తపల్లె, కొండపేట, మోడంపల్లె గ్రామాలల్లో కలిపి మొత్తం 22 వేల సర్వీసులు ఉన్నాయి. అందుకు సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో ప్రజలు నిత్యం లోవోల్టేజి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి గాలివానకు సైతం విద్యుత్ నిలిచిపోతుండటం సమస్యగా మారింది. ప్రధానంగా రాజానగర్, శ్రీరామ్‌నగర్, వినాయకనగర్, నల్లబండ బజారులో లోవోల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోవోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలోని 10 ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ అందులో 4 ప్రాంతాల్లో మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టారు. మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం దొరకకపోవడంతో తలనొప్పిగా మారిందని సిబ్బంది తెలియజేస్తున్నారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే స్థానిక నివాసాలవారు అంగీకరించడం లేదని, ఫిర్యాదులు చేసి అడ్డుకుంటున్నారని విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ శాఖ ఏఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటిని మార్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు.



ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం



మురుగు కాలువలో ఉన్న విద్యుత్ స్తంభం



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పంట ఉత్పత్తుల పెంపుదలకు కృషి



డ్రోన్ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదిలి రూరల్: వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకే వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహిస్తున్నట్లు దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తూము వెంకటేశ్వరరెడ్డి, ప్రద్యుమ్నయాదవ్ పేర్కొన్నారు. గరువారం పొదిలి మండలం ఆముదాలపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. అంతేగాకుండా నూనె గింజల సాగు పెంచాలని సూచించారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉద్యానవన పంటలైన బొప్పాయి, దానిమ్మ సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయనిర్మల, ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి, ఏపీ సీడ్స్ ఒంగోలు మేనేజర్ బుచ్చమ్మ, ఏఓ షేక్ జైనీలా బీన్, ఉద్యానవన అధికారి డి.సంధ్య, జిల్లా వనరుల కేంద్రం ఏఓ శేషమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ నర్మద, రైతులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

- ఉపాధి హామీ సిబ్బందితో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

పొదిలి రూరల్: ఉపాధి హామీ పథకం సిబ్బంది పనితీరు మార్చుకుని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జల్‌జీవన్ మిషన్ పథకం పనుల పరిశీలనలో భాగంగా పొదిలి మండలంలోని అక్కచెరువు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా ఎస్సీ కాలనీలోని చర్చిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. గ్రామాలో కూలీలు అందరూ పనికి వెళ్తున్నారా.. కూలి గిట్టుబాటు అవుతోందా.. సౌకర్యాలు కల్పిస్తున్నారా అని ప్రశ్నించగా కూలీల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెరువులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో కూలీలు అందరికీ పని కల్పించకపోవడం, ఎప్పుడో చేయాలస్సిన జంగిల్ క్లియరెన్స్ పనులు ఇప్పుడు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. పనుల చేయించడంలో ఇంత నిర్లక్ష్యంగా ఉన్న ఎఫ్ఏను ఎలా కొనసాగిస్తున్నారని ఈవోఆర్డీని ప్రశ్నించారు. ఇప్పటికైనా సిబ్బంది పనితీరు మార్చుకుని సకాలంలో కూలీలకు పని కల్పించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ లలితకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ మహాలక్ష్మి, ఈసీ శివకుమార్, టీఏలు ఉన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి



రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్



కాటాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

- డీలర్లను ఆదేశించిన సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లోని రేషన్ డీలర్లు కార్డుదారులకు అందుబాటులో ఉండి సరుకులను సకాలంలో అందజేయాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం సమయ పాలన పాటించి తమ షాపులను తెరిచి ఉంచాలన్నారు. రేషన్ షాపులను లబ్ధిదారులకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల కాటాల పరిశీలన

గిద్దలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేసి డీలర్ల వద్దనే సరుకులు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని రేషన్ దుకాణాల్లో మూలనపడిన కాటాలను గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో పరిశీలించారు. కాటాలతోపాటు ఈ-పాస్ యంత్రాల పనితీరును తనిఖీ చేశారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి డీలర్లను ఆదేశించారు.

కంభం: రేషన్ కార్డుదారులకు ఇబ్బంది లేకుండా బియ్యం అందించాలని మండల తహసీల్దార్ వి.కిరణ్ సూచించారు. మండలంలోని పలు రేషన్ షాపులను గురువారం ఆయన తనిఖీ చేశారు. సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్చార్జి ఆర్ఐ పీర్సా, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని తర్లుపాడులో పలు రేషన్ దుకాణాలను తహసీల్దార్ కేకే కిషోర్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాప్‌ల వద్ద కార్డుదారులకు సరుకులు అందజేయాలని చెప్పారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డి, వీఆర్ఓలు శివకాశి, షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు ఉన్నారు.

రేషన్ దుకాణాల్లోనే సరుకుల పంపిణీ

కొమరోలు: రేషన్ కార్డుదారులకు జూన్ 1వ తేదీ నుంచి డీలర్ల వద్దే సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. కొమరోలులోని రెవెన్యూ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్డుదారులు మండంలోని ఏ రేషన్ షాపులోనైనా సరుకులు తీసుకోవచ్చని పేర్కొన్నారు. కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా సరుకులను అందజేయాలని డీలర్లకు సూచించారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఇంటి వద్దే సరుకులు అందించాలన్నారు. రేషన్ దుకాణాల వద్ద నేమ్ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మదార్‌వలి

పొదిలి: దివ్యాంగులకు ఆయా కార్పొరేషన్ల ద్వారా మంజూరయ్యే రుణాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాల్లో జీఓ నంబర్ 43 ప్రకారం 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ×మీరు దివ్యాంగులు. రుణాలు ఇస్తే ఎలా తీరుస్తారి్ని పలువురు బ్యాంకు అధికారులు తమ ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేశారు. జాతీయ వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం తగు విచారణ చేసి, బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు. సచివాలయాల్లో దివ్యాంగుల ప్రవేశానికి వీలుగా ర్యాంపుల నిర్మాణం, వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సయ్యద్ సుబానీ, ఎం.కృష్ణ, ఎస్‌కే మస్తాన్ బాషా, ఎస్‌డీ ఆరిఫా తదితరులు ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న గంజి వీరయ్య

గిద్దలూరు రూరల్: విద్యార్థులు అన్ని రంగాలల్లో రాణించాలని వేంకటేశ్వరస్వామి ఆలయం కమిటీ అధ్యక్షుడు గంజి వీరయ్య అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజ్ఞానం పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చిన్నారులు వేసవి సెలవులు వృథా చేయకుండా పుస్తక పఠనం చేయడంతోపాటు నచ్చిన అంశాలపై శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు పి.స్వరూపారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు రామిరెడ్డి, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, యువప్రగతి పథం సంస్థ నిర్వాహకులు ఫరూక్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే గ్రంథాలయాల లక్ష్యం



విద్యార్థులతో జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

మార్కాపురం: విద్యార్థుల సమగ్రాభివృద్ధే గ్రంథాలయాల లక్ష్యమని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కె.ఆదిలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మార్కాపురంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడంతోపాటు చిత్రలేఖనం, చదరంగంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ సీహెచ్ తిరుపాలయ్య జూన్ 4వ తేదీన చేతి రాతపై పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని గ్రంథ పాలకులు జీవీ శివారెడ్డి కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

బేస్తవారిపేట: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ.. సైన్స్, వినోదం అందించే పుస్తకాలు వార్తాపత్రికలు చదవడం వల్ల సమాజంలో జరుగుతున్న వాస్తవిక పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. డ్రాయింగ్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

పొదిలిలో ఆక్రమణల తొలగింపు



పాతూరులో డ్రెయినేజీని పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరెడ్డి

పొదిలి: పొదిలి ప్రధాన రహదారి వెంట ఆక్రమణల తొలగింపును గురువారం స్థానిక నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో చిన్న బస్టాండ్‌లోని చిరు దుకాణదారులు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. పాతూరు ప్రధాన రహదారిలో డ్రెయినేజీలో పూడిక తీయించారు. ఓ మెడికల్ షాపు యజమాని వ్యర్థాలను డ్రెయినేజీలో వేసినట్లు గుర్తించి రూ.500 జరిమానా విధించారు. అమ్మవారిశాల వీధిలో రోడ్డు వెంట ఏర్పాటు చేసిన బంకును తొలగించారు. కాగా, ఆక్రమణల తొలగింపులో అధికారులు పక్షపాతం చూపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై కమిషనర్ నారాయణరెడ్డిని వివరణ కోరగా.. అటువంటిది ఏమీ లేదని, ఈ రోజు కాకుంటే మరో రోజైనా మొత్తం తొలగిస్తామని స్పష్టం చేశారు.

యోగా సాధనతో ఆరోగ్యం

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ప్రశాంతత నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఏపీఓ గురువరకుమార్, ఏఈ శ్రీనివాసనాయక్, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి పాల్గొన్నారు.

కొమరోలు: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 3వ రోజు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఎంఈఓ-2 బొర్రా వెంకటరత్నం, ప్రభుత్వ ఉపాధ్యాయులు, వీఆర్ఓలు, స్థానికులు యోగా గురువు పొట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆసనాలు వేశారు.

తూతూమంత్రంగా యోగా శిక్షణ

కంభం: మండలంలో యోగా శిక్షణ తరగతులపై ఉద్యోగులు ఆసక్తి కనబరచకపోవడంతో తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది మొత్తం కలిపి 126 మంది ఈ నెల 31 వరకు మండల స్థాయిలో నిర్వహించే యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొని, జూన్ 2వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే గురువారం శిక్షణ తరగతులకు కేవలం 40 మంది మాత్రమే హాజరు కావడం గమనార్హం.



బేస్తవారిపేటలో యోగా చేస్తున్న అధికారులు



కొమరోలులో..



కంభంలో స్వల్పంగా హాజరైన ఉద్యోగులు

లబ్ధిదారులకు పనిముట్ల పంపిణీ



పనిముట్లు అందజేస్తున్న పోస్టు మాస్టర్ ఇందిర తదితరులు

మార్కాపురం టౌన్: విశ్వకర్మ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పనిముట్లను పోస్టుమాస్టర్ ఇందిర గురువారం తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశ్వకర్మ పథకంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వం మంజూరు చేసిన పనిముట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకు మేనేజర్ సాయిరాం, మార్కాపురం బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, జాతీయ కౌన్సిల్ మెంబర్ శాసనాల సరోజిని, కో కన్వీనర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు: వ్యవసాయ భూములు కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతులందరూ కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందేందుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ షేక్ మహమ్మద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ యజమానితో చేసుకున్న కౌలు ఒప్పంద పత్రం, ఆధార్ కార్డు జిరాక్సు కాపీతో వీఆర్వోలను సంప్రదిస్తే కార్డు జారీ చేస్తారని పేర్కొన్నారు.